నవతెలంగాణ
ఆదిలాబాద్
1
గురువారం | అక్టోబర్ 19, 2023 | www.navatelangana.com

20న కాగజ్‌నగర్‌కు మందకృష్ణ రాక

నవతెలంగాణ - బెజ్జూర్

ఈ నెల 20న కాగజ్‌నగర్ పట్టణానికి ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోంఁ్రడ బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పోస్టర్లను ఎంఎస్‌పీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు డిమాండ్ చేస్తూ జరిగే కార్యక్రమానికి మందకృష్ణ వస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ పిట్టల సత్యనారాయణ, నాయకులు శ్రీశైలం, ఏ తిరుపతి, గోలేటి పోచం పాల్గొన్నారు.



ఉచిత చేప పిల్లల పంపిణీ

మందమర్రి : మత్స్యకారుల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలో నిర్వహించారు. ఫిషరీస్ ఏడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆదర్శ పాఠశాల ప్రాంతంలో మండలానికి చెందిన 14 చెరువులకు చెందిన మత్స్యకారులకు 4,56,000 చేప పిల్లల్ని అందించారు. మత్స్యకారుల జీవనోపాధికి సంబంధించిన ఈ పథకాన్ని వంద శాతం రాయితీతో అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ మెన్ డి.రాజేష్, ఫిషరీస్ అసిస్టెంట్ శ్రావణ్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కట్ట మోహన్, ఆర్కేపి మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నూనె శ్రీనివాస్, యాదగిరి ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



గులాబీకి దూరం..హస్తానికి దగ్గర..!

- రేపు బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రాజీనామా
- ఈ నెల 21న దిల్లీలో కాంగ్రెస్‌లో చేరికకు నిర్ణయం
- టికెట్‌పై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో కలవరం
- నేడు రేవంత్‌ను కలిసేందుకు హైదరాబాదుకు పయనం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ మారడం చర్చనీయాంశమవుతోంది. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు టికెట్లు దక్కని ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపురావు పార్టీ అధిష్టానం వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొన్ని రోజుల క్రితం రేఖానాయక్ గులాబీ పార్టీకి రాజీనామా చేయగా.. తాజాగా రాథోడ్ బాపురావు సైతం అదే దారిలో పయనించేలా నిర్ణయం తీసుకున్నారు. పది రోజుల క్రితమే బీఆర్ఎస్ నుంచి వైదొలగాలని భావించారు. ఈ విషయం పార్టీ అధిష్టానానికి తెలియడంతో మంత్రి కేటీఆర్ హైదరాబాదుకు పిలిపించుకొని మాట్లాడారు. దీంతో కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉండిపోయారు. టికెట్ రాకపోయినా తనకే బీఫాం వస్తుందని చివరి క్షణం వరకు నమ్మకంతో ఉన్నారు. కానీ రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ పార్టీ అభ్యర్థులకు బీఫాంలు అందించడం.. అందులో ఉమ్మడి జిల్లా నుంచి అందరు ఎమ్మెల్యే అభ్యర్థులు అందుకోవడంతో పాటు బోథ్ నుంచి అనిల్‌జాదవ్‌కు బీఫాం అప్పగించారు. దీంతో మరింత అసంతృప్తికి గురైన బాపురావు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. బోథ్ టికెట్ ఇచ్చేందుకు హామీ లభించిందని ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది.

ఆశావహుల్లో కలవరం..!

బోథ్ నుంచి బరిలో దిగేందుకు పలువురు ఆశావహులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనేక ఏండ్ల నుంచి పార్టీలో ఉంటూ బలోపేతం కోసం కృషిచేసిన పలువురు నాయకులు తమకే టికెట్ వస్తుందని ఇన్నాండ్లు ఎవరికి వారు ధీమాతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఈ నియోజకవర్గంలో ఏకంగా 10మంది ఆశావహులు దరఖాస్తులు అందజేయడం విశేషం. నరేష్‌జాదవ్, ఆడె గజేందర్, వన్నెల అశోక్ తదితర నాయకులు టికెట్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఇన్నాండ్లు పార్టీ కార్యక్రమాలతో పాటు ఎవరికి వారు గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల, బెల్లంపల్లి, నిర్మల్ నియోజకవర్గాలకు టికెట్లు కూడా ప్రకటించింది. మిగితా నియోజకవర్గాలకు సైతం టికెట్లు కేటాయించే సమయంలో బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావు కాంగ్రెస్‌లో చేరడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. ఇన్నాండ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఆశావహులు కాకుండా కొత్తగా చేరుతున్న ఎమ్మెల్యేకు టికెట్ కేటాయించడం ఏంటని వారిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. బాపురావుకు బోథ్ టికెట్ కేటాయించకూడదని ఇక్కడ టికెట్ ఆశిస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డిని కలిసేందుకు నేడు హైదరాబాదుకు వెళ్లనున్నట్లు తెలిసింది. బోథ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్‌లో జరుగుతున్న ఈ పరిణామాలు ఎక్కడి వరకు దారితీస్తాయోనని ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



మంగళవారం రేవంత్‌రెడ్డిని కలిసిన రాథోడ్ బాపురావు

ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉంటూ..

దశాబ్దకాలంగా బోథ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాథోడ్ బాపురావు గులాబీ పార్టీకి దూరం కానున్నారు. ఈ నెల 20న భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)కు రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరుసటి రోజు ఈ నెల 21న కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన బాపురావు హస్తం పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ టికెట్ ఇస్తారనే హామీ లభించడంతోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిసింది.కాగా ఇప్పటికే ఖానాపూర్‌కు చెందిన మరో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. సార్వత్రిక ఎన్నికల వేళ సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ మారడం వంటి పరిణామాలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క బాపురావుకు టికెట్ ఇవ్వకూడదని పలువురు కాంగ్రెస్ ఆశావహులు రేవంత్‌రెడ్డిని కలిసేందుకు గురువారం హైదరాబాదుకు వెళ్లనున్నట్లు తెలిసింది.

ధైర్యంగా ఉండండి.. కాంగ్రెస్ టికెట్ నాకే వస్తుంది

- టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు డా. వన్నెల అశోక్



నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ పార్టీ టికెట్టు తనకే వస్తుందని, బోథ్ నియోజకవర్గ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు డా. వన్నెల అశోక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టికెట్ కోసం పార్టీలో నాయకులు వస్తున్నారన్నారు. పార్టీ అధికారంలో లేకపోయిన కాపాడుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటున్న వారికే టికెట్ వస్తుందన్నారు. పార్టీలోకి ఎవరైనా రావచ్చని, కానీ ఎన్నికల సమయంలో టికెట్, పదవుల కోసం వచ్చే నాయకులకు కార్యకర్తలు బుద్ధి చెబుతారన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిల ఆశీస్సులు తనకు ఉన్నాయని, బోథ్ నుంచి టికెట్ తనకే వస్తుందని ధీమావ్యక్తం చేశారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, కష్టపడి క్షేత్రస్థాయిలోపని చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పార్టీ కన్వీనర్ సంతోష్, నాయకులు హన్మండ్లు, గంగారెడ్డి, చిన్న రాంరెడ్డి, రామన్న యాదవ్, రజవాలి పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి అండగా బీఎస్పీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కోసాయి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోయిన బాధితులు టేకాం లక్ష్మీబాయి కుటుంబానికి బీఎస్పీ బోథ్ ఇన్‌చార్జి జంగుబాపు అండగా నిలిచారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పేదలను ఆదుకోవడానికి తను ముందుంటాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నైతం కృష్ణ, పేగ్గర్ల అరవింద్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ లాభాల్లో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీని లాభాలబాట పట్టించడం, అభివృద్ధిపథంలో నిలపడంలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకమని రీజనల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. బుధవారం డిపో గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ మాసంలో అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, టీమ్స్ డ్రైవర్స్, మెకానిక్‌లతో పాటు ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను శాలువాలతో ఘనంగా సత్కరించి నగదు రివార్డులను అందించారు. నలుగురు కండక్టర్లు, పది మంది డ్రైవర్లు, ఇద్దరు మెకానిక్‌లకు శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళ స్వీపర్లకు డీఎం కల్పన ఆర్ఎం చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ఆపరేషన్స్ ప్రణీత్, డిప్యూటీ మెంటెనెన్స్ ప్రవీణ్ కుమార్, ఎంఎఫ్ రాజేందర్, రిజార్వేషన్ ఇంచార్జీ సయ్యద్ అహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

చంద్రబాబు సతీమణికి పరామర్శ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని బుధవారం రాజమండ్రిలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి ఆనంద్ కలిసి పరామర్శించారు. చంద్రబాబు త్వరలోనే జైలు నుండి బయటకు వస్తారని, ధైర్యంగా ఉండాలని ఆమెకు సూచించినట్లు ఆనంద్ తెలిపారు.

కర్ణాటకలో అమలవుతున్న పథకాలు చూసేందుకు సిద్ధమా..?

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తలేదని లేనిపోని ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న అక్కడ అమలవుతున్న పథకాలను కళ్లారా చుసేందుకు కర్ణాటకకు రావడానికి సిద్ధమా..? అని అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత సవాల్ విసిరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఇంద్రనగర్, హామాలీవాడ, తిలక్ నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఉద్యోగాల పేరిట యువతను, పథకాల పేరిట రైతులను, మహిళలను మోసం చేశారని ఆరోపించారు. గాంధీనగర్ కాలనీలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, ఇచ్చిన ఇండ్లే తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. అటు సీఎం కేసీఆర్, ఇటు ఎమ్మెల్యే జోగు రామన్న కుటుంబ సభ్యులకే ఉద్యోగాలు వచ్చాయని, యువతకు ఎక్కడ ఉద్యోగాలు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, చిలుకూరి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్, మాజీ పట్టణ అధ్యక్షుడు వసీం, యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నాహిద్, తుడం వినోద్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గండ్రత్ వెంకట్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు చోర్‌గావ్, బాబేఝరీ, సుంగాపూర్ గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌నాయక్ ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ కార్డులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. వారి వెంట స్థానిక మండల నాయకులు లోఖండే దేవ్ రావ్, జకిరుల్లా ఖాన్, అహ్మద్, వసంత్ రావ్, నూర్‌చంద్ తానాజీ, రవీందర్ పాల్గొన్నారు.



నార్నూర్: మాట్లాడుతున్న శ్యాంనాయక్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

- ఎమ్మెల్సీ దండే విఠల్



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇంచార్జీ దండే విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో తుడుందెబ్బ మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి, ఇతర సంఘ నాయకులు ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ సమక్షంలో చేరారు. వారికి గులాబి కండువలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరేందుకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వస్తున్నారని తెలిపారు. గత పాలకులు చేయలేని విధంగా కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధి చేశారన్నారు. మరింత అభివృద్ధి జరగాలన్న మరిన్నీ సంక్షేమ పథకాలు రావాలన్న రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఉట్నూర్

దక్షిణ భారత అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్ 14 విభాగంలో ఉట్నూర్ గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. వరంగల్‌లో జరిగిన క్రీడాల్లో రికార్డు నెలకొప్పి బుధవారం ఉట్నూర్‌కి చేరుకున్న విద్యార్థులకు క్రీడా పాఠశాల ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. కేబీ ప్రాంగణంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉత్తం మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అండర్-14 విభాగంలో సతీష్ జావెలిన్ త్రో, పరశురాం పరుగు పందెంలో సరికొత్త రికార్డును నెలకొల్పారనా్ౖర. ఒకే కుటుంబంలోని ఇద్దరు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించడం అభినందనీయమన్నారు. మరింత శ్రమించి భవిష్యత్తులో మరిన్నీ పథకాలు సాధించాలని ఆకాక్షించారు. అనంతరం ఇద్దరు విద్యార్థులతో కోచ్ సునంద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారాం, ప్రభాకర్, మాధారావు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెక్‌పోస్ట్‌లను పరిశీలించిన ఎస్పీ



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళిలో భాగంగా చించోలి(బి), కొండాపూర్, సొన్ చేక్ పోస్టులను బుధవారం ఎస్పీ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. వాహనాల తనిఖీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల ద్వారా పట్టుకున్న డబ్బు, మద్యం, ఇతర వాటికి గురించి సిబ్బంది ఎస్పీకి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహారాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తనిఖీల సమయంలో వీడియోగ్రఫీ తీసుకోవాలన్నారు. రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని, ఆధారాలు చూపితే వదిలివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, నిర్మల్ రూరల్, సొన్ సీఐలు శ్రీనివాస్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

వసతిగృహం సందర్శన...

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సాయుధ ప్రత్యేక బలగాలకు చించోలి గ్రామ శివారులోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్‌లో వసతి ఏర్పాటు చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ సందర్శించినారు. ఈ సందర్భంగా అక్కడ వసతులు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులకు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, నిర్మల్ గ్రామీణ, పట్టణ సీఐలు పురుషోత్తం చారి, శ్రీనివాస్ ఉన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ముథోల్: మండలంలోని బోరిగాంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం గ్రామంలోని దుర్గామాతకు పూజలు చేసి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. పార్టీ బలపరిచిన అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తరపున మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ పేదల సంక్షేమానికి పెద్ద పీఠ వేశారన్నారు. ఈ సారి కూడా విఠల్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపంచడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలీద్, సర్పంచ్ ఎర్రం అమృత మురళీ, ఎంపీటీసీ జ్యోతి దేవన్న పాల్గొన్నారు.



నేటి వాహనాల వేలంపాట రేపటికి వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించాల్సిన వాహనాల వేలం పాటను వాయిదా వేసి 20న నిర్వహించనున్నట్లు సీఐ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల అధికారుల సమావేశం ఉన్నందున వేలం వాయిదా వేసి తిరిగి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున వేలంలో పాల్గోనే ఔత్సాహికులు గమనించాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన అబ్దుల్ సోయాల్ ఇంటిలో రేషన్ బియ్యంన్ని అక్రమంగా కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్దంగా ఉన్నట్లు ముందస్తు సమాచారం మేరకు బుధవారం అబ్దుల్ సోయల్ ఇంటి లో తనిఖీ చేయగా 12 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని లభ్యం అయినట్లు ఎస్సై కష్ణ సాగర్ రెడ్డి తెలిపారు అట్టి బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ తరలించినట్లు వెల్లడించారు.

తాడిహత్నూర్‌లో అన్నదానం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగదంబ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో బుధవారం గ్రామానికి చెందిన రాథోడ్ సరితా రామేశ్వర్ అన్నదానం చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో మహిళలు ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు రోజుకు ఒకరు చొప్పున అన్నదానం చేసే విధంగా అలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ మధుకర్, వైస్ ఎంపిపి చంద్రశేఖర్, నాయక్ రాథోడ్ తానాజి పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.40లక్షలు పట్టివేత



నవతెలంగాణ- నేరడిగొండ

ఎన్నికల నియమావళిలో భాగంగా నేరడిగొండ మండల కేంద్రం నుంచి రోల్ మామడ టోల్ టోల్ ప్లాజా వరకు పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం చేపట్టిన తనిఖీల్లో రూ.40లక్షలు పట్టుబడ్డాయి. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నాగేందర్ వివరాలు వెల్లడించారు. ఉదయం ఎస్సై సాయన్న, టీఎస్ఎస్‌పీ, ఏఆర్ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రలోని పర్లి నుంచి స్కోడా కారులో రూ.40లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అందరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

బీఆర్ఎస్ ప్రటించిన మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్ విస్తృ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటింటికి వెళ్లి తెలియజేయడంతో పాటు మెనిఫెస్టోను వివరించాలని కోరారు. పార్టీ గెలుపుకు కార్యకర్తలే కీలకమని, అలాంటి కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి గోడం నగేష్ మాట్లాడుతూ అనిల్ జాదవ్ గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏనుగు కృష్ణా రెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముండే పాండురంగ్, ఎంపీటీసీలు గాడ్గే సుభాష్, శివారెడ్డి, మండల మాజీ కన్వీనర్ మెహరాజ్, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

రశీదు భద్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రసీదులు పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని పెంబి మండలం ఇటిక్యాల వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. బుధవారం కర్నూలు సీడ్ కంపెనీతో కలిసి పోచంపల్లిలో క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో లూజుగా విత్తనాలు అమ్మడానికి వచ్చే వ్యాపారుల నుండి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రైతులు వ్యవసాయ శాఖ నుండి లైసెన్స్ పొందిన విత్తన వ్యాపారుల నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయలన్నారు. రసీదుపై పాలేరు పేరు కాకుండా రైతు పేరునే రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ కంపెనీ అధికారులు రవి, రమేష్, కృష్ణ రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీపీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఎంపీపీ రాథోడ్ సజన్, కన్వీనర్ శివారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. సౌకర్యార్థం కార్యాలయాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పండరి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణ్, గులాబ్ ప్రతాప్ సింగ్, రాజేశ్వర్లు పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-కడెం

డిజిటల్ విధానంలోనే వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ సుమన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులు చెల్లింపుపై అవగాహన కల్పించారు. వినియోగదారులు కార్యాలయానికి రాకుండా స్మార్ట్ ఫోన్‌ల ద్వారా ఏ విధంగా బిల్లులు చెల్లించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాదంతో హ్యాట్రిక్ సాధిస్తా

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు
- సొంత గ్రామం నుంచి ప్రచార రంగంలోకి ఇంద్రకరణ్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ఐకే రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజాల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిపొంది హ్యాట్రిక్ సాధిస్తానని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ధీమావ్యక్తం చేశారు. ఇటీవల సీఎం కేసీఆర్ బీ ఫాం ఇచ్చిన నేపథ్యంలో బుధవారం తన ఎన్నికల ప్రచారాన్ని శ్రీకారం చుట్టారు. దీనికి నిర్మల్ మండలంలోని తన సొంత గ్రామం ఎల్లపల్లి వేధికైంది. ముందుగా గ్రామంలోని దుర్గామాత, అంజేయస్వామి దేవాలయాల్లో పూజలు చేశారు. అనంతరం కుటుంబ పెద్దలతో ఆశీర్వాదం తీసుకుంటి ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఆయనకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కుమురం భీం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారధ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి సోపానాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్ల గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తుతున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పనులను వివరించి భవిష్యత్తులో మరింత అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. తొమ్మదిన్నర ఏండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, బీఆర్ఎస్ మేనిపెస్టోను వివరిస్తూ ఓట్లు అడుగుతామన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విధంగా మేనిపెస్టో ఉందని, బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. ఎన్నడూలేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించామన్నారు. నిర్మల్ ప్రజలు మరోసారి ఆశీర్వాదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడోసారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ధీమావ్యక్తం చేశారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 ఏళ్లుగా ప్రజలు మోసం చేస్తున్న రామన్న

- కంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు




పార్టీలో చేరిన వారితో కలిసి నినాదాలు చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జోగు రామన్నను ఓడించి ఇంట్లో కూర్చోబెట్టాలని, 15 ఏళ్లుగా ఆయన ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో నియోజకవర్గంలోని తర్నం గ్రామస్తులతో పాటు రూరల్ మండలం పరిధిలోని చిచ్‌ధరి ఖానాపూర్, పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, దుర్గానగర్, ఇంద్రనగర్, డాల్డా కంపెనీ కాలనీవాసులు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతామని, అందరికీ న్యాయం చేసే దిశగా పథకాలను రూపొందిస్తామని కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. జోగు రామన్నను ఓడించాలంటే కేవలం 40 రోజులే ఉన్నాయని, అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అంటూ సవాల్ విసిరితే వెనకడుగు వేశారని ఎద్దేవా చేశారు. పాయల శంకర్, జోగు రామన్న ఇద్దరు దొంగలేనని, శరీరాలు వేరైనా ఆత్మ ఒక్కటేనన్నారు. వారిని నమ్మి మళ్లీ మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐనేని సంతోష్‌రావు, సయ్యద్ సుజాత్‌అలీ, ఎంఏ షకీల్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ షెడ్మకి ఆనంద్ రావు, నాగర్‌కర్ శంకర్, కొండూరి రవి, మానే శంకర్, రాజ్ మహమ్మద్, పెందూర్ ప్రభాకర్, ఎల్టీ సన్నీరెడ్డి, శ్రీరామ్, షేక్ మన్సూర్, బూర్ల శంకర్, అన్నెల శంకర్, సమీ ఉల్లాఖాన్, రమేష్, జంగిలి ప్రవీణ్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నవతెలంగాణ-కడెం

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొని బావితరాల మంచి మార్గానికి బాటలు వెయ్యాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం మండలంలో పర్యటించారు. తొలుత ప్రాథమికోన్నత పాఠశాలలో స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, రెవెన్యూ కార్యాలయం, సంపద వనం, కొత్త మద్దిపడగలో నిర్మిస్తున్న పునరావాస గృహాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం బతుకమ్మ, ఓటర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును వినియోగించుకోవాలన్నారు. నవంబర్30న ఎన్నికల్లో ఎలాంటి ప్రలోబలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. వంద శాతం పోలింగ్ అయ్యేల అధికారులు అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఉపేందర్, ఏపీఓ జయదేవ్, ఏపీఎం రాజారాం, పీఆర్, ఈజీఎస్, ఐసీడీఎస్ సిబ్బంది మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

వారంలోగా వంద శాతం సీఎంఆర్ పూర్తి చేయాలి

- నిర్మల్ కలెక్టర్ అశీష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

వారంలోగా వంద శాతం సీఎంఆర్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సింగ్వాన్ అన్నారు. బుధవారం ఐడీఓసీ సమావేశంలో రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 12 బాయిల్డ్, 46 రా రైస్ మిల్లులు సీఎంఆర్‌లో పాల్గొన్నాయి. 2022-23 పంటల కాలంలో లక్ష 68 వేల 177 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేటాయించడం జరిగిందన్నారను. దానికి అనుగుణంగా మిల్లర్లు లక్ష 12వేల678 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ఇవ్వాల్సి ఉండగా 23వేల 891 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ఇచ్చారని కలెక్టర్ తెలిపారు. మిగితా 88,910 మెట్రిక్ టన్నుల ఇవాల్సి ఉందన్నారు. 21 శాతం మాత్రమే ఇచ్చారని, యాసంగి 2022-23 పంట కాలంలో నందు12 బాయిల్డ్, 36 రా రైస్ మిల్లులు సీఎంఆర్‌లో పాల్గొనగా యాసంగి 2022-23 పంట కాలానికి బాయిల్డ్, రారైస్ మిల్లులకు1,58,566 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేటాయిస్తే 1,06,844 మెట్రిక్ టన్నుల్లో కేవలం 2,424 మెట్రిక్ టన్నుల ఇచ్చినట్లు తెలిపారు. 1,04,413 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందన్నారు. జీఓ ఎంఎస్ నెం.23 ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో సీఎంఆర్ పూర్తి చేయని మిల్లులో గల వరి ధాన్యమును సీఎంఆర్ పూర్తి చేసిన ఇతర మిల్లులకు పంపించడం జరుగుతుందన్నారు. సీఎంఆర్ పూర్తి చేయని వారిపై, పీడీఎస్ రైస్ కొన్న సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎం శ్రీకళ, పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ

బేల : ఎన్నికల సందర్భంగా మండలంలోని శంకర్‌గూడ వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. వాహన తనిఖీలు చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహారాష్ట్ర నుంచి జిల్లాలో అక్రమ మద్యం, డబ్బు, ఇతర సామాగ్రి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట జైనథ్ సీఐ నరేష్ కుమార్, ఎస్సై డి రాధిక, పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేయాలని కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్ సూచించారు. బుధవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా లక్ష్మణచాంద మండలం కేంద్రంలో నూతన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి ఎన్నికల్లో ఏ విధంగా వ్యవహరించాలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా మండల నాయకులకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను గడప గడపకు ప్రచారం చేయాలన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కూచాడీ శ్రీహరి రావు మాట్లాడుతూ అధినాయకత్వం నమ్మకం, విశ్వసం ఉంచి తనకు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిందన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కలిసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలను చైతన్యవంతులను చేసి పార్టీ రాబోయే రోజుల్లో అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ప్రజలకు వివరించాలన్నారు. 40 రోజులు కష్టపడి పనిచేసి తనను గెలిపిస్తే అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్, అంజుమన్ అలీ, నాదేడపు చిన్నూ, మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్, మాజీ సర్పంచులు ప్రతాప్ రెడ్డి, అట్ల రాంరెడ్డి, మండల నాయకులు ఈటెల శ్రీనివాస్, అట్ల రవీందర్ రెడ్డి, సమ్మెట రవి, వినీష్ పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని విద్యుత్ ఓవర్ లోడ్ ఉన్న కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎస్ఈ సంపత్ ప్రారంభించారు. బుధవారం విద్యానగర్, ద్వారకానగర్, కొలిపుర, బొక్కలగూడ, ఖానాపూర్, అంబేద్కర్ నగర్‌లలో 100 కేవీకి సంబంధించిన 7 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో భాగంగా ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు దేవేందర్, ఈదన్న, హరి కష్ణ, దుర్గా ప్రసాద్, సదానందం, విలాస్, సాంబయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాపురావ్‌పై చీటింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు విక్రయించినందుకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుపై కోర్టు ఆదేశాల మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఎమ్మెల్యే 2012లో ఆదిలాబాద్ సమీపంలోని బట్టిసావర్గం సర్వే నెంబర్ 53/2లో రెండు గుంటల భూమిని ఆదిత్య ఖండేష్కర్ అనే వ్యక్తికి విక్రయించారు. తిరిగి ఆ ప్లాట్లను 2019లో సంతోష్ అనే వ్యక్తి కొన్నారు. మొదట కొనుగోలు చేసిన ఆదిత్య ఖండేష్కర్ కోర్టును ఆశ్రయించారు. కాగా కోర్టు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతో పాటు సుదర్శన్ అనే వ్యక్తిపై ఐపీసీ 420, 409, 416, 418, 421, 423 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండలం గొల్లమడ గ్రామంలో జరిగింది. గొల్లమడకు చెందిన కోపెల్లి లక్ష్మణ్ (30) మంగళవారం పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్ళి తిరిగి వస్తున్న క్రమంలో సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని భార్య ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేపటి ఎమ్మార్పీఎస్ రథయాత్రను జయప్రదం చేయండి

నవతెలంగాణ-బేల

ఎస్సీ వర్గీకరణయే లక్ష్యంగా శుక్రవారం నుంచి రథయాత్ర ప్రారంభం అవుతుందని, మాదిగ, మాదిగ ఉప కులాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎన్నో ఎండ్లుగాఉద్యమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పటికీ స్పందించడం లేదన్నారు. వర్గీకరణే లక్షంగా చేపట్టే రథయాత్రను ఆదిలాబాద్ నుంచి ప్రారంభం అవుతుందన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గైక్వాడ్ సూర్యకాంత్, మండల అధ్యక్షుడు కుశ్నపెల్లి అంకుష్, ప్రధాన కార్యదర్శి సునీల్, జితేందర్ పాల్గొన్నారు.

3
నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | అక్టోబర్ 19, 2023 | www.navatelangana.com

డీఈఓను కలిసిన పీఆర్టీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా విద్యాధికారి అశోక్‌ను పీఆర్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విద్యాధికారి కార్యాలయం నూతన సమీకృత భవనంలోకి మారిన తర్వాత మొదటిసారిగా కలిసిన నేపథ్యంలో జిల్లా విద్యాధికారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎన్నికల తర్వాత అన్ని అంశాలపై నిర్ణయాలు వెలువడతాయని జిల్లా విద్యాధికారి తెలియజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రకాష్, నాయకుడు ఉదయ బాబు పాల్గొన్నారు.

నాల్గవ రోజు ఉత్సవాల్లో శాఖాంబరి అవతారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారద గణేష్ మండలి వద్ద ఏర్పాటుచేసిన దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు శాకంబరి అవతారంలో భాగంగా కూరగాయలతో అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా కూరగాయలతో విగ్రహాన్ని శాకాంబరి అవతారంగా కొలిచినట్లు తెలిపారు. ప్రజలను సుఖశాంతులతో ఉండేలా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలి కమిటీ అధ్యక్షుడు పుల్లూరు రవి, సభ్యులు గీత, అశ్విన్, మంగ, విలాస్, వివేక్, శ్రీనివాస్, రజిని, మహేందర్, శిరీష, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపుపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యుత్ బిల్లుల డిజిటల్ చెల్లింపుపై బుధవారం వినియోగదారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, బిల్ డెస్క్, అమెజాన్, టీ వాలెట్ ద్వారా చెల్లించవచ్చని, దీని ద్వారా కార్యాలయానికి వెళ్లి క్యూలో నిల్చొని కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన ఇబ్బందులు తప్పుతాయని ట్రాన్స్‌కో అసిస్టెంట్ అధికారి తుకారం, ఏడీఈ శ్రీనివాస్ సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈ కమలాకర్, ఫోర్‌మెన్ భూమయ్య, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సోయాబీన్‌లో పంట కోత ప్రయోగం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తుమ్మిహేటి గ్రామ శివారులో గల సోయాబీన్ పంటలలో మండల వ్యవసాయ అధికారి సమక్షంలో గురువారం వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగం ద్వారా పంట దిగుబడి వ్యయాన్ని అంచనా వేయవచ్చని వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ రైతులకు సూచించారు. ముదుగా ఎంపిక చేసిన పంటలో ఐదు మీటర్ల పొడవు, వెడల్పు గల స్థలంలో పండిన పంటను కోసి తూకం వేయగా 3.485 కిలోల పంట దిగుబడిని గుర్తించారు. ఈ మేరకు ఒక ఎకరానికి 5.50 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అనంతరం ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వివిధ రకాల పంటల సాగుపై తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న, రైతులు తిరుపతి, విలాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి ఎన్నికల ప్రచారం ప్రారంభం



నవతెలంగాణ-వాంకిడి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని మహగావ్, గోవగావ్, రాజీవ్‌గూడ, చిన్నపటేల్ గూడ, మొకాసీగూడ, ఏటిగూడ, చిచ్చుపెల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ప్రతి కుటుంబానికి పథకాల ద్వారా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రాన్నే ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ విమలాబాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ మృతికి సంతాపం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్ కొక్కుల వరమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె సంఘానికి అనేక సేవలందించారని గుర్తు చేశారు.

అక్రిడిటేషన్ లేని జర్నలిస్టులకూ ఎన్నికల పాసులివ్వాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అక్రిడేషన్ కార్డులు లేని వర్కింగ్ జర్నలిస్టులకు నవంబర్ 30న జరిగే ఎన్నికలకు పాసులివ్వాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత అక్రిడేషన్ కార్డులు జారీ కాకపోవడంతో కొంతమంది జర్నలిస్టులకు రాలేదన్నారు. అక్రిడేషన్ కార్డులు లేని జర్నలిస్టులకు న్యూస్ కవరేజ్ కోసం ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ పాసులు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టులకు పాసులు లేకపోవడంతో కొంతమంది జర్నలిస్టులు వార్త సేకరణ కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సహాయ కార్యదర్శి దేవునూరి రమేష్, జర్నలిస్టులు రాందాస్ జాడే, జాడే శ్రీనివాస్, కుమురం రాజు, రమేష్, తిరుపతి, రాకేష్ పాల్గొన్నారు.

పండుగ పూటా పస్తులేనా..?

పట్టణంలోని అన్ని వార్డులలో చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ పట్టణవాసులు రోగాల బారిన పడకుండా చేసే పారిశుధ్య కార్మికులు వారు. ఈ కార్మికులే అసలైన దేవుళ్లంటూ గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నుండి మొదలుకొని, పురపాలకశాఖా మంత్రి కేటీఆర్‌తో సహా అన్ని మున్సిపాలిటీలలో పాలకవర్గాలు వీరిని సన్మానించి సత్కరించారు. కాని కార్మికులకు చెల్లించే వేతనాల వద్దకు వచ్చేసరికి మాత్రం ఈ కార్మికులు పాలకవర్గాలకు రాక్షసులుగా కనిపిస్తున్నారు.

- తొమ్మిదో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె
- బుధవారం చేపట్టిన పికెటింగ్ విజయవంతం



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ముందు పికెటింగ్ చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె చేపడుతున్నారు. ఇప్పటికే మూడు నెలలుగా ఈ కార్మికులకు వేతనాలు లేవు, ఇప్పుడు నడుస్తున్న అక్టోబర్ నెల పూర్తయితే నాలుగు నెలలు అవుతుంది. ప్రస్తుతం బతుకమ్మ, దసరా పండుగలు ఉన్నాయి. ఈ పండుగలకు కుటుంబ సభ్యులతో వారు సంతోషంగా గడపలేని పరిస్థితి నెలకొంది. పండుగకు 15 రోజుల ముందే బకాయి వేతనాలు చెల్లిస్తే తమ పిల్లలకు కొత్త బట్టలు కొని వారి ముఖాల్లో సంతోషం చూడాలని ఆశపడ్డారు. కాని వీరి ఆశలు నెరవేరే పరిస్థితులు లేకపోవడం, ఇంటికి వెళ్లి పిల్లల ముఖాలు చూసి బాధపడలేని పరిస్థితులలో సమ్మెకు దిగారు. ఈ నెల పదో తేదీ నుండి వారు మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేపడతున్నారు. బుధవారం నాటికి వీరి సమ్మె తొమ్మిదో రోజుకు చేరినా అధికారుల నుండి, పాలకవర్గం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు పికెటింగ్ చేపట్టారు. ఉదయం తొమ్మిది గంటల నుండే కార్యాలయం ముందు కార్మికులు బైటాయించారు. పదిన్నరకు కమిషనర్ అంజయ్య, ఇతర సిబ్బంది వచ్చినా వారిని కార్యాలయం లోనికి వెళ్లనీయలేదు. దీనితో అధికారులు, సిబ్బంది కార్యాలయం బయటే వేచి చూశారు. మధ్యలో కమిషనర్ అంజయ్య కార్మికులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. సాయంత్రం వరకు కార్మికులు అలాగే ఉండడంతో అధికారులు, సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ పికెటింగ్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాదవ్ రాజేందర్, ముంజం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఆర్ త్రివేణి, నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు ఇ శంకర్ పాల్గొన్నారు.

బిల్లు కట్టక కరెంట్ కట్ చేశారు..: కె అశోక్



15 ఏళ్లుగా కార్మికునిగా పని చేస్తున్నాను. ప్రతి సారీ సమ్మె చేస్తేనే కాని అధికారులు జీతాలు చెల్లించడం లేదు. మూడు నెలలుగా కరెంట్ బిల్లు కట్టలేదు. కరెంట్ కట్ చేశారు. ముగ్గురు పిల్లలకు బట్టలు కొందామని ఆశ పడితే ఇపుడు ఆ ఆశ తీరేలా లేదు. ఈఎస్ఐ, పీఎఫ్ గురించి ఇప్పుడు మేం అడగడం లేదు. కనీసం మేము చేసిన పనికి జీతాలు ఇవ్వమని అడుగుతున్నం. అది కూడా తప్పేనా..?

ముగ్గురు పిల్లలకు ముఖం చూపించలేకపోతున్నా..: కె.మల్లేష్



నాకు ముగ్గురు ఆడ పిల్లలు. పండుగ కోసం హాస్టల్ నుండి ఇంటికి వచ్చారు. కొత్త బట్టలు కొనివ్వమని అడుగుతున్నరు. జీతాలు ఇస్తరేమో ఆ డబ్బులతో కొనిస్తానని అనుకున్నా, కాని తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా ఫలితం లేదు. ఇప్పుడు ఇంటికి వెళితే పిల్లలకు ముఖాలు చూపించలేని పరిస్థితి ఉంది. కిరాణా దుకాణంలో కూడా ఉద్దెర ఇవ్వడం లేదు. పండుగ ఎట్లా జరుపుకోవాలో అర్థం కావడం లేదు.

ఎన్నికలపై సెక్టార్ అధికారులు అవగాహన కలిగి ఉండాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టార్ అధికారులు ఈవిఎం, వివి ప్యాట్లు, హ్యాండ్ బుక్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి నియోజకవర్గ సెక్టార్ అధికారులతో ఈవిఎం, వివి ప్యాట్లు, హ్యాండ్ బుక్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని, సెక్టార్ అధికారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో వసతులు, ర్యాంపులు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో ఏదైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే వెంటనే పూర్తి చేసి అన్ని వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్లో వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుండి సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సిబ్బందిని తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడం, రిజర్వు ఈవి ఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సెక్టార్ అధికారులు తమ సెక్టార్ పరిధిలోని రహదారులు, వాగులు, కల్వర్టులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నా, తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఏమైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే రిటర్నింగ్ అధికారికి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సెక్టార్ అధికారులు

కోనప్పను ఓడిస్తేనే సిర్పూరుకు విముక్తి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఓడిస్తేనే సిర్పూరు నియోజకవర్గానికి విముక్తి కలుగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కుటుంబ ఆగడాలు మితిమీరిపోయాయని, ఇవి ఆగాలంటే రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని కోరారు. ఎస్పీ సురేష్‌కుమార్ ఎమ్మెల్యేకు వంతపాడుతూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నాడని ఆరోపించారు. ఎస్పీని బదిలీ చేస్తే తప్ప జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా జరిగే పరిస్థితులు ఇప్పటికే తాను ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్పీని బదిలీ చేసి, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులుగా ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టడమే కాకుండా ఆయన స్మారకంగా ఫ్రీడం యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. అత్యాధునిక మౌళిక సదుపాయాలతో ప్రతి జిల్లాలో అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ బిజినెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. పది హామీలతో తాము బీఎస్పీ మేనిఫెస్టోను విడుదల చేసినట్లు తెలిపారు. గురువారం కౌటాలలో భారీ జనసమీకరణతో సభ ఏర్పాటు చేయనున్నామని, నియోజకవర్గానికి చెందిన పలువురు బీఎస్పీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్‌హుస్సేన్, అసెంబ్లీ అధ్యక్షులు డోకె రాజన్న, ముస్తఫిజ్ హుస్సేన్, తన్నీరు పోచం, షబ్బీర్‌హుస్సేన్, జమున మహేష్, నక్క మనోహర్, సిద్దం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సిబ్బంది కృషి చేయాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాబోయే శాసనసభ ఎన్నికలను స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సిబ్బంది అహర్నిశలు కృషి చేయాలని ఎస్పీ సురేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టులలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ చెక్‌పోస్టుల గుండా మద్యం, పరిమితికి మించిన డబ్బులు, గంజాయి రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా ప్రతి ఒక్కరు కృత నిశ్చయంతో 24 గంటలు అప్రమత్తతతో విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికలలో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతర సామాగ్రి జిల్లాలోనికి ప్రవేశించకుండా చెక్‌పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఉదయం 6గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ప్రచారానికి అనుమతి ఉంటుందని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సూర్యాస్తమయం తర్వాత ప్రచారం చేయరాదని, పోలీస్ శాఖ మార్గదర్శకాలను నాయకులు పాటించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎస్‌పిలు వెంకటరమణ, కరుణాకర్, ఎస్‌బి సిఐ రాణా ప్రతాప్, డిసిఆర్‌బి సిఐ రమేష్, సిసి ఎస్ఐ ముత్యం రాజు, డిపిఓఎఓ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

నవతెలంగాణ-కౌటాల

ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్ఎస్‌లోకి వలసలు భారీగా పెరుగుతున్నాయి. బుధవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో బీజేపీ, బీఎస్పీ పార్టీల నుంచి పదుల సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని గురుడుపేట, చింతలమానెపెల్లి మండలంలోని కర్జెల్లి, బాబాసాగర్ గ్రామాల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి కోనప్ప కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ పాలనలో పల్లెలన్నీ ఊహించని అభివృద్ధి సాధించాయన్నారు. ప్రజలందరికి పాలన సులభమయ్యేందుకు నూతన పంచాయతీలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఊహించని అభివృద్ధి జరుగుతుందని, బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను ఇతర పార్టీలు కాపీ కొడుతున్నాయని, పెట్టని పథకాలను కూడా అమలుచేసిందని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట కౌటాల, చింతలమానెపెల్లి ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- జిల్లా ఇంటర్ విద్యాధికారి నైతం శంకర్



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడులకు ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో సుఖశాంతులు నింపాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ఆలవాలమైన బతుకమ్మను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినిలతో కలిసి మహిళా అధ్యాపకులు బతుకమ్మ వేడుకల్లో బతుకమ్మ ఆడి అలరించారు. కార్యక్రమంలో మహిళా సిబ్బంది మంజుల, మల్లీశ్వరి, వెంకటేశ్వరి, సుమలత, దీప్తి, ఏకలవ్య, సంధ్యారాణి, నిర్మళ, శారద, స్వమ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని గిరవెల్లి గ్రామంలో వర్షాలు కురవాలని కోరుతూ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో లక్ష్మీ దేవారతో ఊరేగింపు నిర్వహించి అనంతరం గ్రామస్తులంతా సమీప దేవాలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహనా సదస్సులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులు డిజిటల్ చెల్లింపుల ద్వారా చెల్లించాలని కౌటాల ఏఈ రవీందర్ అన్నారు. నగదు రహిత చెల్లింపుల కోసం బుధవారం రవీంద్రనగర్-1 గ్రామంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, బిల్ డెస్క్, అమెజాన్, టి వాలెట్ వంటి ద్వారా చెల్లించవచ్చన్నారు. కార్యాలయానికి వెళ్లి లైన్‌లో నిలబడి చెల్లించనవసరం లేదని తెలిపారు. ఇంటి వద్దనుండే చెల్లించవచ్చన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'డిజిటల్ పద్ధతిలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి'

నవతెలంగాణ-జన్నారం



డిజిటల్ విధానంలోనే వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించాలని మండల విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వినియోగదారులకు డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులను చెల్లించే పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వినియోగదారులు కార్యాలయానికి రాకుండా స్మాట్ ఫోన్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యుత్ ఏఈ లచ్చన్న సబ్ ఇంజనీర్ అజయ్, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో నగదు పట్టివేత

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ బన్సీలాల్, ఎస్ఐ, సిబ్బందితో కలిసి కాంట ఏరియా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి ఎలాంటి రశీదులు లేని రూ.4.20లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో నగదు కలిగి ఉన్న సిరికొండ కనకయ్య వద్ద నుండి రూ.3లక్షలు, వడ్నాల నర్సయ్య వద్ద నుండి రూ.1.20లక్షలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పజెప్పారు.

సరి 'హద్దు' దాటుతున్న మద్యం

- ఎన్నికల సమయంలోనూ అక్రమ రవాణా
- రూ. లక్షల్లో గడిస్తున్న అక్రమార్కులు
- పక్క రాష్ట్రాల నుంచి నిషేధిత మత్తు పదార్థాల దిగుమతి
- అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలం

నవతెలంగాణ-కోటపల్లి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అక్రమ మద్యం దందా ఆగడం లేదు. అధికారులు ఎంత నిఘా పెంచినా మత్తు పదార్థాల రవాణా సరిహద్దులు దాటుతోంది. అధికారుల కండ్లుగప్పి అక్రమార్కులు యాదెచ్ఛగా నిషేధిత మత్తు పదార్థాలు పక్కరాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటుంన్నారు. మండలం లోని వెంచపల్లి, జనగామ, ఆలుగామా గ్రామాల నుంచి రోజుకి లక్షల్లో విలువైన మద్యం నాటు పడవల ద్వారా మహా రాష్ట్రకి సరఫరా అవుతున్న సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మహా రాష్ట్రలోని గడ్చిరోల్లి, వార్థ, చంద్రపుర్ జిల్లాల్లో మద్యపాన నిషేధం అమలులో ఉన్నందున దళారులు ఈ అవకాశాన్ని అదునుగా చేసుకుని మద్యాన్ని రెట్టింపు ధరలకు విక్రయిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. సరిహద్దు గ్రామాల ప్రజలు పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



ఎన్నికల కోడ్ బేకతర్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న లక్షలు విలువైన మద్యం రాష్ట్రం దాటుతున్నా పట్టింపులేని తనంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నాటు పడవల ద్వారా నిత్యం మండల కేంద్రంలోని మద్యం దుకాణం నుంచి సరఫరా అవుతోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ మద్యం మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాలలో నిలువ పెడుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు నిలువ చేసి ఎన్నికల సమయంలో తిరిగి దిగుమతి చేసుకుంటారని ఆరోపనలు ఉన్నారు. రోజు 50 వరకు లిక్కర్ కాటన్‌లు వెళుతున్న అధికారులకు కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే మద్యం రవాణా చేస్తున్నా వారికి ఎన్నికల కోడు వర్తించదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ దందాలకు అధికారుల అండదండలు ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నాటు పడవల ద్వారా మద్యం రవాణ (ఫైల్)

దిగుమతి అవుతున్న గంజాయి, మత్తు పదార్థాలు

లిక్కర్ మహా రాష్ట్రకు ఎగుమతి చేస్తూ అక్కడి నుంచి ఆడర్‌పై గంజాయిని దిగుమతి చేసుకుంటున్నారు. మండల సరిహద్దు గ్రామాలకు రాత్రి సమయంలో చేరవేస్తూ యుతను పెడదారి పట్టిస్తున్నారు. నిషేధిత మత్తు పదార్థాలు కావాలంటే సరిహద్దు గ్రామాలైన ఆలుగామా, వెంచపల్లి, అన్నారం, సిర్స, పుల్లగమ గ్రామాల లిక్కర్ వ్యాపారులకు టచ్‌లో ఉన్నవారికి వాటిని సరఫరా చేస్తున్నారు. ఈ మత్తు పదార్థాలు రెండు రోజులకు ఒక సారి గ్రామాలకు దిగుమతి అవుతోంది. దీంతో సరిహద్దు గ్రామాలో యువత సాయంత్రం సమయంలో మత్తు పదార్థాలు తీసుకుని బానిసలవుతున్నారని సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆటోలో లిక్కర్ రవాణా

కోడ్ ఉల్లంగిస్తే కటిన చర్యలు

- మహేంద్రనాథ్ తహసీల్దార్ కోటపల్లి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యాన్ని గానీ మత్తు పదార్థాలను ప్రజలలో చెలామని చేసేందుకు ప్రయత్నిస్తే కోడు ఉల్లంఘన కింద కటిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణ అరికట్టేందుకు ప్రత్యేక బృందాల ద్వారా నిఘా పెంచుతున్నాం. తనిఖీలు చేపడుతున్నపుడు పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

అక్రమ రవాణ మా దృష్టికి రాలేదు

-హరి ఎక్సైజ్ సీఐ చెన్నూర్

మద్యం సరఫరా మా దృష్టికి వచ్చింది. ప్రతి గ్రామంలో మద్యాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. మా పరిధిలో మండలాలు ఏక్కో అయ్యేసరికి తిరగడం కష్టమవుతుంది. మద్యం సరఫరా విషయంలో నిబంధనలు విస్మరిస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

మత్తు పదార్థాలకు బానిసకావద్దు

- విద్యాసాగర్ సీఐ చెన్నూర్ రూరల్

నిషేధిత మద్యానికి ఎవరు బానిస కావద్దు. నిషేధిత మత్తు పదార్థాలు ఎవరు రవాణ చేసినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఈ నిషేధిత మత్తు పదార్థాల సమాచారం లేదు. మత్తు పదార్థాలను రవాణ చేసే వారిపై నిరంతరం నిఘా ఉంటుంది. చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం.

కుమ్మరి సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



కుమ్మరి సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా జన్నారం మండలానికి చెందిన కోడూరు చంద్రయ్య నియమితులయ్యారు. జనగామ పట్టణంలో కుమ్మరి సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఇందులో చంద్రయ్యను సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కుమ్మరులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకం ఎక్కువ అయ్యే కొద్ది కుమ్మరులు తయారు చేస్తున్న వస్తువులకు గిరాకీ తగ్గిందన్నారు. కుమ్మరుల జీవనస్థితిగతులు అగమ్య గోచారంగా తయారయ్యాయి అన్నారు. వారిని ప్రభుత్వం అందించి ఆదుకోవాలని కోరారు.

నేడు కల్వరీ చర్చి ఉపవాస దీక్షల ముగింపు



నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి కల్వరీ చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్షల ముగింపు సభను గురువారం సాయంత్రం నిర్వహించనున్నన్నారు. ప్రతి ఏడాది ప్రవీణ్ పాస్టర్ 50 రోజులు ఉపవాస దీక్షలు చేపడుతారు. 'ఈ ఏడాది 11వ ఉపవాస దీక్షల ముగింపు సభకు క్రైస్తవులు ఒక రోజు ముందుగానే సభ వద్దకు చేరుకుంటున్నారు. ఈ సభకు జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశ నలుమూలల నుంచి క్రైస్తవులు సుమారు 2 లక్షల మంది హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో కిరాణా దుకాణాలలో బెల్ట్ షాపులలో అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని లక్షెట్టిపేట్ ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్ మందపల్లి రేండ్లగూడ, గ్రామాలలో ఉన్న దుకాణాలలో సోదాలు చేయగా పీ.సత్యం అనే వ్యక్తి వద్ద, 15 బీర్లు, రాయల్ చాలెంజ్ విస్కీ ఇతర అక్రమ మద్యం లభించడంతో అతనిని పట్టుకొని, కేసు నమోదు చేశారు. పట్టుకున్న అక్రమ మద్యం విలువ, రూ.5300 విలువ ఉంటుందని ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్ తెలిపారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నగ్న వీడియోలు తీసిన వ్యక్తికి ఏడాది జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు ఇంట్లో స్నానం చేస్తున్నప్పుడు వీడియోలు, ఫోటోలు తీసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. కోర్టు లైజన్ అధికారి, ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం..కౌటాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌటి గ్రామానికి చెందిన బోర్కుటే బారు కుమారుడు బోర్కుట్ వినోద్ ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు వారి వారి ఇళ్లలో స్నానం చేస్తున్నప్పుడు నగ్న వీడియోలు, ఫోటోలు తీశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసులు అందించిన సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేయడంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫోక్సో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితుడికి ఫోక్సో చట్టం, 66ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ కింద ఏడాది జైలు శిక్ష, సెక్షన్ 354సి, 292ఐపీసీ కింద రూ.5వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితునికి శిక్ష పడేలా చేసిన పోలీసులను అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు అభినందించారు.

ధర్మారావుపేటలో రఘుపతిరావు వర్ధంతి



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ధర్మారావుపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ఎం పీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొక్కిరాల రఘుపతిరావు 11వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ మాట్లాడుతూ రఘుపతిరావు ఆశయాలను కొనసాగించాలని, పార్టీలకు అతీతంగా ఆయన ఎంతో మందికి సేవ చేశారని తెలిపారు. తన పదవీ కాలంలో నీతి, నిజాయితీ, నిబద్దత, విలువలు, క్రమశిక్షణతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, ఎంపిటిసిలు పార్వతి మల్లేష్, భీమ్‌రావ్, మాజీ సర్పంచ్‌లు జాడి శంకర్, ప్రభాత్‌రావు, సీనియర్ నాయకులు కన్నాక రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గోలేటి స్వామి, మైనార్టీ మండల అధ్యక్షులు శాఖీర్, ఓసిసి కార్మిక నాయకులు అన్నం కుమార్, ఎన్ఎస్‌యుఐ నాయకులు విద్యాసాగర్, నాయకులు సతీష్, కొత్త రమేష్, మైదం రమేష్, చిలుకయ్య, మహంకాళి, శ్రీనివాస్, చారి, వెంకటేష్, ప్రేమ్ కుమార్, ఖదీర్, శివ, రాజు పాల్గొన్నారు.

డా.వేణుగోపాల్‌ను సన్మానించిన పోలీసులు

నవతెలంగాణ-ఖానాపూర్

నిర్మల్ ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ డా.వేణుగోపాలకృష్ణను పోలీస్‌లు ఘనంగా సన్మానించారు. ప్రయివేట్ ప్రాక్టీస్ లేకుండా ఆయన అందిస్తున్న ఉత్తమ సేవలకు అనేక ప్రభుత్వ పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ వైద్యుడు, కవి, కళాకారుడు, దర్శకునిగా ఎన్నో ఉన్నత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాహిత పోలీస్ మిత్ర వైద్యాధికారిగా మంచి పేరు సంపాదించుకున్నారు. మండలంలో ఇటీవల గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రజినీకాంత్, సిబ్బంది గోవిండ్, గీత పాల్గొన్నారు.

21న టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



21న సింగరేణి వ్యాప్తంగా జరిగే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. బుధవారం ఆర్కే 7 గని, నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అక్టోబర్ 16న చెల్లించాల్సిన లాభాల వాటాను, దసరా పండుగ అడ్వాన్స్‌ను యాజమాన్యం నిలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 21న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తలపెట్టిన ఒక్కరోజు టోకెన్ సమ్మెను కార్మికులందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనాలన్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల్లో ఆర్థిక ప్రయోజనం కల్పించేందుకు కార్మికులకు రావాల్సిన 32 శాతం లాభాల వాటాను, పండగ అడ్వాన్స్‌ను ఆపారని మండిపడ్డారు. సింగరేణి కార్మికులు రక్తాన్ని చెమటగా మార్చి ఉత్పత్తిని సాధిస్తే సంస్థ లాభాలను అర్జించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలకు కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటాకు సంబంధమేంటని ప్రశ్నించారు. యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే కార్మికులకు రావాల్సిన డబ్బులను నిలిపి వేసిందన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందే యాజమాన్యం కార్మికులకు 16న లాభాల వాట 32 శాతం చెల్లిస్తామని ఈ నెల 4న సర్క్యులర్ విడుదల చేసిందని గుర్తు చేశారు. లాభాల వాటా కార్మికులకు చెల్లించకూడదని ఎన్నికల కోడ్‌లో లేదన్నారు. కార్మికులు తీసుకునే లాభాల వాటా ప్రభుత్వ పథకం కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అమలు అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేనటువంటి కార్మికుల లాభాల వాటాను నిలిపివేయడం యాజమాన్యం కుట్రలో భాగమని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే కార్మికులకు చెల్లించాల్సిన 32 శాతం లాభాల వాటతోపాటు పండగ అడ్వాన్స్‌ను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో అవసరమైతే సమ్మెకైనా వెనకాడబోమని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్ మల్లేష్, ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, ఫిట్ కార్యదర్శిలు బీర రవీందర్, ఆకుల లక్ష్మణ్, ఆడెపు మల్లికార్జున్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మైనింగ్ స్టాప్ నాయకులు రాజేందర్, చంద్రశేఖర్, సామిని సదానందం, కీసర రవితేజ, మాటూరి వంశీకృష్ణ, అల్లాటి శ్రావణ్ పాల్గొన్నారు.

ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-భీమారం

ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదిన వేడుకలు మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో పోలంపల్లి గ్రామంలోని అనాథ ఆశ్రమ పిల్లతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, సర్పంచ్ గద్దె రాంరెడ్డి, స్థానిక సర్పంచ్ దర్శనాల రమేశ్, నాయకులు పొడేటి రవి, దాసరి మధునయ్య రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, జర్పుల రాజ్‌కుమార్ నాయక్, ఆత్కూరి రాము, బొల్లం శ్రీనివాస్, వొడేటి బలరాంరెడ్డి, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్, ప్రణీత్‌గౌడ్, దాసరి మణిదీపక్ పాల్గొన్నారు.

ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్ల

యాజమాన్య వైఖరి సరికాదు



నవతెలంగాణ-మంచిర్యాల

ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్ల యాజమాన్యం వైఖరి సరికాదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిరంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్అండ్‌పీసీ సిబ్బందిని కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భాగ్యరాజు మాట్లాడుతూ ప్రతి డిపార్ట్మెంట్‌లో ఐఈడి లెక్కల ప్రకారం అని చెప్పే యాజమాన్యం సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం ఐఈడి ప్రకారం కొత్త నియామకాలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. సెక్యూరిటీ సిబ్బంది పట్ల యాజమాన్యం వ్యవహరించే తీరు సరిగ్గా లేదన్నారు. ముఖ్యంగా హెల్మెట్ పెట్టుకొని కార్మికులు రాకపోయినా, చిన్న తప్పిదాలకు వార్నింగ్ లెటర్లు, సస్పెండ్ లేటర్లు ఇవ్వడం వంటివి చేయడం సరికాదన్నారు. అసలు సెక్యూరిటీ సిబ్బంది నిర్వహించే విధులకు కార్మికులు హెల్మెట్ పెట్టుకొని రాకపోవడానికి సంబంధం లేదని, దొంగతనాలు జరగకుండా తనిఖీలు నిర్వహించడమే వారి బాధ్యత అని తెలిపారు. సంబంధం లేని పనులు చేయించడం సరికాదన్నారు. మైనింగ్ వారిని సెక్యూరిటీకి అధికారులుగా నియమించడంతో యూనిఫామ్ వ్యక్తి ఏ పనులు చేయాలో తెలియడం లేదని, అందుకే యూనిఫామ్ వ్యక్తినే సెక్యూరిటీకి అధికారిగా నియమించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా దూర పోస్టులు ఉన్నవారికి, కంప్యూటర్ పోస్టులో డ్యూటీ చేసేవారికి పేరెడ్ రోజున పేరెడ్ మాస్టర్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కస్తూరి చంద్రశేఖర్, బ్రాంచ్ నాయకులు భానేష్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలను ప్రజలకు వివరించాలి

నవతెలంగాణ-తాండూర్

బీఆర్ఎస్ మేనిఫెస్టోలో రూపొందించిన అంశాలను కార్యకర్తలకు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ కోరారు. బుధవారం తన చాంబర్లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు మహిళలకు సముచిత న్యాయం జరిగేలా మేణిఫెస్టో రూపొందించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గెలిస్తే అర్హులైన మహిళలకు నెలనెల రూ.3వేల నగదు అందజేస్తుందన్నారు. రూ.400కే గ్యాస్ అందజేస్తామన్నారు. పేద ప్రజలందరికీ రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. ఆయన వెంట మార్కెట్ డైరెక్టర్ సంతోష్ కుమార్, నాయకులు బాబురావు ఉన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో డెంగ్యూ దూరం

నవతెలంగాణ-ఇచ్చోడ

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని మండల వైద్యాధికారి సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భుక్తాపురా కాలనీలో దోమల మందు స్ప్రే చేసి ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇటీవల డెంగ్యూ మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సిబ్బంది వసంత్, సుభాష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
5
గురువారం | అక్టోబర్ 19, 2023 | www.navatelangana.com

ముగ్గురు గుడుంబా విక్రేతల బైండోవర్

నవతెలంగాణ-నార్నూర్



అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిని తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. మండలంలోని మహాగావ్ గ్రామానికి చెందిన ముండే వెంకట్ రావ్, మెస్రం వినాయక్, ఖంపూర్ గ్రామానికి చెందిన గజానంద్ గుడుంబా విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ రాజాలింగం ఎదుట బైండోవర్ చేశారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని లేని పక్షంలో కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

అమ్మవారి దర్శనానికి 12 కిలో మీటర్ల పాదయాత్ర

నవతెలంగాణ-లక్ష్మణచాంద



నిర్మల్ పట్టణంలో ఉన్న శ్రీనంది గుండా దుర్గామాత అమ్మవారి దర్శనానికి లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ), బాబాపూర్ గ్రామాలకు చెందిన దుర్గాదేవి మాలధారణ భక్తులు బుధవారం పాదయాత్రగా బయల్దేరారు. జై దుర్గా .. జై జై దుర్గా నినాదాలతో దాదాపు 12 కిలో మీటర్ల వరకు పాదయాత్రగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు వారి గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న శ్రీదుర్గాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాలధారణ భక్తులు మహిపల్, అశోక్, శ్రీకాంత్, మాత స్వాములు పాల్గొన్నారు.

ప్రయాణికులను ఆకట్టుకునేల ఆర్టీసీ ఆఫర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంస్థకు ఆదాయం, సురక్షిత ప్రయాణంతో పాటు ప్రయాణీకులను ఆకట్టుకునేల ఆఫర్లను తీసుకువచ్చింది. ఇందులో భాగంగానే వందరోజుల గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌ను తీసుకుంది. ఆఫర్ గురించి బుధవారం డీపోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రీజనల్ మేనేజర్ సొలొమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసర పండుగల నేపథ్యంలో అక్టోబర్ 22 నుంచి జనవరి 22 వరకు గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌ను తీసుకున్నామన్నారు. పండుగల కోసం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామన్నారు. రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 446 బస్సులను నడిపిస్తున్నట్లు తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో ఈ నెల 18 నుంచి బస్టాండ్లు, ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా డ్రాప్ బాక్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రీజియన్ కేంద్రంలో లక్కీ డ్రా నిర్వహించి 10 మంది చొప్పున విజేతలను అధికారులు ఎంపిక చేస్తారన్నారు. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు రూ.11 లక్షల నగదు బహుమతులను సంస్థ అందించనుందని పేర్కొన్నారు. ప్రతి రీజియన్‌కు ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు మొత్తం 110 మందికి ఒక్కొక్కరికి రూ.9900 చొప్పున నగదు బహుమతులను ఇవ్వనున్నట్టు వెల్లడించారు. బతుకమ్మ, దసరా పండుగలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు రాఖీ పౌర్ణమి మాదిరిగానే ఈ లక్కీ డ్రా సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రామగుండంకు ఎవరూ చేసిందేమీ లేదు

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం నియోజక వర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ చేసిందేమీ లేదని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, రామగుండం అభ్యర్థి గొర్రె రమేష్ అన్నారు. గోదావరిఖని మేదరబస్తీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 రోజుల నుంచి టీఎల్పీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్నికల శంఖారావ ప్రచారం ఉధృతం జరిగిందని, రామగుండం ప్రజలు తనను గెలిపిస్తామని ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఇక్కడి దళితులను దళిత బంధు విషయంలో మోసం చేశాడన్నారు. సోమారపు సత్యనారాయణ కూడా దళితులను మోసం చేశాడని, అప్పటి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణను మేయర్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా అణిచివేశాడని అన్నారు. మక్కాన్‌సింగ్ దళిత యువకులను రౌడీలుగా, గుండాలుగా మార్చి వారిని, ఆర్థికంగా వారి కుటుంబాలను నాశనం చేసి, ఆయన మాత్రం నాయకునిగా ఎదిగి, మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశాడని ఆరోపించారు. కాబట్టి రాబోయే ఎన్నికలలో దళితలకు ద్రోహం చేసిన వీరిని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు అల్లెపు తిరుపతి, బాజా వెంకటేష్, గొర్రె అఖిల్ వర్మ, జక్కం కవిత, చెరుకు పైడి, చిట్యాల మోహన్ రెడ్డిలు తదితరులున్నారు.

చెన్నూర్‌లో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుంది

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫయాజోద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. వామపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ చెన్నూర్ అసెంబ్లీ టికెట్‌ను సీపీఐకి వదులుకున్నట్లు బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గెలుపు ఖాయంగా ఉన్నటువంటి చెన్నూర్ టికెట్‌ను కాంగ్రెస్ ఎట్టిపరిస్థితుల్లో వదులకోవడం ఉండదని తెలిపారు. ఈ విషయంలో అధిష్టానం పూర్తి స్థాయిలో విశ్వాసంతో ఉన్నదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న మోసాలతో విసిగి వేసారిన చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలుపించడం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు పిడుగు వెంకన్న, నాయకులు వడ్లకొండ వెంకన్న, వర్కింగ్ యూత్ అధ్యక్షులు కామెర సతీష్, అధికార ప్రతినిధి గంగాధరి రాజయ్య, ప్రధాన కార్యదర్శి తుంగపిండి ఆనంద్, తిరుపతి అరిగిల శ్రీనివాస్ గౌడ్, తుంగపిండి శ్రీనివాస్, కొక్కొండ మహేందర్, అల్లూరి స్వామి, మీసాల రాజు, మీసాల తిరుపతి, దుర్గయ్య పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : కాంగ్రెస్ అధిష్టానం చెన్నూరు టికెట్ సీపీఐకి పార్టీకి కేటాయించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ చౌక్ చౌరస్తాలో కండ్లకు నల్ల రిబ్బన్స్ కొట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా చెన్నూరు నియోజకవర్గ టీపీసీసీ జనరల్ సెక్రటరీ రఘునాథ్‌రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, మందమర్రి మండల అధ్యక్షుడు నిలయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, మహంతి రవి, భూమేష్, యూత్ నాయకులు, కదం శ్రవణ్ కుమార్, కొప్పర్తి నవీన్, అఖిల్, రాంసాయి, అనిరుద్ పాల్గొన్నారు.

మందమర్రి : చెన్నూరు టికెట్‌ని సీపీఐకి కాకుండా కాంగ్రెస్‌కే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు సొతుకు సుదర్శన్ కోరారు. బుధవారం మందమర్రి పట్టణ పాత బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు సొతుకు సుదర్శన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ కార్డులను షాప్ షాప్‌కి తిరుగుతూ వ్యాపారస్తులకు వివరించారు. సోతుకు సుదర్శన్ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలను పెట్టి ప్రతి ఒక్కరికీ చెందే విధంగా ప్రభుత్వాన్ని నడిపించేవారన్నారు. కానీ బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వంటగ్యాసు, డీజిల్ పెట్రోల్ అలాగే నిత్యవసర వస్తువులు ధరల్ని అధికంగా పెంచి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. కేంద్రంలో బీజేపీని రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను చిత్తుచిత్తుగా ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు అసంతృప్తితో ఉన్నారని చెన్నూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ జనరల్ సెక్రెటరీ సోతుకు రాజయ్య, ఆలం శంకర్, తాడగోని కనకయ్య, మాయ లింగయ్య, కాంపల్లి రాజనర్సు, ముద్ర కూల కొమురయ్య పాల్గొన్నారు.



జైపూర్



మందమర్రి



రామకృష్ణాపూర్

కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే పూలపండుగను ఊరువాడ అంతటా ఘనంగా జరుపుకుంటున్నారు. పల్లె పట్నం తేడాలేకుండా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినీలు, అధ్యాపకురాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మను మధ్యలో ఉంచి..గౌరమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బతుకమ్మ పాటలకు తగ్గట్లుగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డీఐఈఓ రవీందర్ కుమార్ కార్యక్రమా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవాండ్లు, అద్యాపకులు పాల్గొన్నారు.
నేరడిగొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగు రంగు పువ్వులతో బతుకమ్మలను పేర్చి డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షబానా, తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుభీర్ : మండలంలోపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకి పూజలు చేశారు. కళాశాల ఆవరణలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, అధ్యాపకులు సంపత్, విజయ్ భాస్కర్, మహేష్, శ్రీనివాస్, రమేష్, శివరాజ్, లింగయ్య, గజేందర్, అశోక్, మాధురి విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీలు రంగురంగుల పూలు సేకరించి బతకమ్మ పేర్చి గౌరమ్మకు పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, అధ్యాపకులు వెంకటరమణ, లింగంపల్లి సుజాత, దోమకొండ సుజాత, పి ఉదయ్ కుమార్, సి నరేష్, వైష్ణవి, అశ్రఫ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



నార్నూర్

21న సింగరేణిలో ఒక రోజు టోకెన్ సమ్మె

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 21న ఒక రోజు టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఈ నెల 16న 32శాతం లాభాల్లో వాటా చెల్లిస్తామని, 18న దసరా పండుగ అడ్వాన్స్‌ను చెల్లిస్తామని యాజమాన్యం ఈ నెల 4 న సర్క్యులర్ జారీ చేసిందని, కాని ఎన్నికల కోడ్ పేరుతో ఇప్పుడు వాటిని చెల్లించలేమని, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతి తీసుకుని చెల్లిస్తామని చెప్పడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం విధానాలను వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ఒక రోజు నిరాహారదీక్ష చేపడుతున్నామని, ఈ నెల 21న ఒకరోజు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చామని, వీటిని సింగరేణిలో జయప్రదం చేయాలని ఆయన కార్మికులను కోరారు. దసరాలోపు లాభాల్లోవాటా, అడ్వాన్స్ చెల్లించాలని లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో వై.వి.రావు, మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎస్ వెంకట్ రెడ్డి, మానాల శ్రీనివాస్, గుర్రం ప్రభుదాస్, బండి మల్లేశ్, తాని రాజబాబు, ఉప్పులేటి తిరుపతి, మద్దెల దినేష్,తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం నాయక్‌కు పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం నాయక్ తండ్రి సునావత్ హుణ్యా నాయక్ ఆదివారం కన్నుమూశారు. డైరెక్టర్ బలరాం నాయక్‌ను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు బుధవారం పరామర్శించారు. సునావత్ హుణ్యా నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పరామర్శించిన వారిలో ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, సీనియర్ జర్నలిస్టు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు తదితరులున్నారు.

మూడోసారి బీఆర్‌ఎస్‌దే అధికారం

నవతెలంగాణ-ముత్తారం

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులయ్యే వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం మైదంబండ, ఖమ్మంపల్లి, గ్రామాలకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పుట్ట మధూకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, మళ్లీ అధికారంలోకి కొత్త పథకాలు అమలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు సుధాటి రవీందర్ రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అల్లం తిరుపతి, సర్పంచ్ ఎర్రం శారద సదానందం, బియ్యని రాజు, జంగ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోదావరిఖని రాంనగర్‌కు చెందిన మారంగుల రమేష్ బాబును నియమిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామకపు ఉత్తర్వులను బుధవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నియమావళిని పాటిస్తూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేయాలని ఆయన ఈసందర్భంగా సూచించారు.

కరెంట్ చార్జీల బిల్లులు యాప్స్ ద్వారా చెల్లించండి

నవతెలంగాణ-మంచిర్యాల

మున్సిపాలిటీ పరిధిలో కరెంట్ చార్జీల బిల్లులు ఫోన్ పే, గూగుల్ పే తదితర యాప్స్ ద్వారా చెల్లించాలని నస్పూర్ ఏఈ రామ్మూర్తి తెలిపారు. బుధవారం ఇంటింటికి తిరుగుతూ ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే విధానంపై అవగాహన కల్పించారు. సీసీసీ, తీగల్‌పహాడ్, శ్రీరాంపూర్ కాలనీ, నస్పూర్ ఏరియాలలో కిరాణా దుకాణాలు, వెల్డింగ్ షాప్, రైస్ మిల్లులు, గృహ సముదాయాలలో విద్యుత్ బిల్లులు విధిగా చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది కరెంట్ ఆఫీస్‌కు వచ్చి బిల్లులు చెల్లించడం లేదా విద్యుత్ అధికారులు ఇంటికి వస్తే విద్యుత్ బిల్లులు కట్టడం లాంటివి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలా కాకుండా ప్రతి ఒక్కరికి ఈ రోజుల్లో మొబైల్ ఆండ్రాయిడ్ ఫోన్స్ ఉన్నందున ఫోన్ పే, గూగుల్ పే ద్వారా బిల్లులు ఎలా చెల్లించాలో తెలియని వారికోసం విద్యుత్ శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

భీమిని : వినియోగదారులు కరెంట్ చార్జీల బిల్లులు ఫోన్ పే, గూగుల్ పే తదితర యాప్స్ ద్వారా చెల్లించాలని ఏఈ బాబురావు, లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ కిరాణా దుకాణాలు, వెల్డింగ్ షాప్స్, రైస్ మిల్లులు, గృహ సముదాయాలలో అవగాహన కల్పించారు. యాప్స్ ద్వారా బిల్లులు చెల్లించిన వారికి శాఖ తరపున అవగాహన కల్పిస్తున్నామని వారు పేర్కొన్నారు.



మంచిర్యాల

తాండూర్ : విద్యుత్ వినియోగదారులు కరెంట్ చార్జీలను ఆన్లైన్ ద్వారా చెల్లించాలని తాండూర్ ఎఈ ప్రభాకర్ తెలిపారు ఆయన. బుధవారం ఐబి, తంగళ్ళపల్లి, కిష్టంపేట తదితర ఏరియాలలోని వ్యాపార సముదాయాల యజమానులకు సెల్‌ఫోన్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించే విధానంపై అవగాహన కల్పించారు. గృహ అవసరాలు వ్యాపార అవసరాల నిమిత్తం వాడే విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించడంతో సమయం ఆదా అవుతాయని తెలిపారు.

కాసిపేట : కాసిపేట మండలంలోని కొండాపూర్, దేవాపూర్, కాసిపేట తదితర గ్రామాల్లో కిరాణ షాపులు, ఇళ్లలో ఆన్లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపుపై విద్యుత్ వినియోగదారులకు ఏఈ స్వర్ణలత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ స్వర్ణలత మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం అనేక రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని, దీని ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. చాలా మంది సబ్ స్టేషన్ వచ్చి బిల్లులు కట్టడం, ఇంటికి విద్యుత్ సిబ్బంది వస్తే బిల్లులు చెల్లిస్తున్నారని, చాలా మందికి బిల్లు ఏ విధంగా చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో అవగాహన కల్పించి ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.



భీమిని



తాండూర్



కాసిపేట